శ్రీ చక్రవర్తి గోపాలకృష్ణమాచార్యుల వారు పండిత కవి. ప్రతిభ - వ్యుత్పత్తి - అభ్యాసం - మూడూ మూర్తీ భవించిన విగ్రహమని తోటి పండితులు శ్లాఘిస్తా రాయన్ని. సచ్ఛీలమూ, ఆత్మాభిమానమూ ఆయన సంపద. సాహిత్యాధ్యయనమూ, పాఠ ప్రవచనాలే ఆయన జీవితాశయం.

సాహిత్యాధ్యాపకులుగా తమ బోధనలతో కళాశాల విద్యార్థులను తీర్చి దిద్ది ప్రయోజకులుగా రూపొందించిన ఆచార్యుల వారు పదవీ విరమణ చేసిన రోజు విద్యార్థు లంతా ఎంతో చింతించారు. నిట్టూర్పులు విడిచారు.

సాహిత్య గ్రంథాల నిరంతర పర్శీలనమే తప్ప ఇతర వ్యాసంగమే తెలియని ఆచార్యుల వారికి, పెళ్ళి కెదిగిన కూతుళ్ళ భవిష్యత్తు అగమ్య గోచరంగా ఉంది. డిగ్రీలు పుచ్చుకున్న కుమార్తెలు ఉద్యోగాలు చేస్తామన్నా ససేమిరా అంగీకరించ లేదు ఆయన. ఆరుగురు కూతుళ్ళ చివర ఒక్కగా నొక్క కొడుకు, భార్యతో కుటుంబ భారాన్ని ఫింఛను డబ్బుతో ఎలాగో ఆచార్యుల వారు లాగుతున్నారు.

## కొడిమెటుగు నాగేశ్వర శాస్త్రి



రోజూ ఉదయం ఆరింటికే, ఆచార్యుల వారి ఇంట్లోంచి వెలువడే నారాయణోపనిషద్వాక్యాలు ఇరుగు పొరుగు వారిని నిద్ర నుంచి మేలుకొల్పుతాయి. ఆయన మార్కెట్టుకు వెళ్ళేటప్పుడు కూడా విష్ణు సహస్రమే ముఖ కమలం నుంచి మధు బిందువుల్లా వెలువడుతూంటే ఆయన్ను చూచిన వారికి హృదయాలు వికసిస్తాయి. పదవుల్లో ఉన్న శిష్యులు తామర తంపరగా ఉన్నా ఎవరి నుంచీ ఏ సాయం కూడా పొందడానికి ఇష్టపడరు ఆచార్యుల వారు. చెప్పిన పాఠాలకు వెల కట్టినట్లవుతుందని ఆయన భావన కాబోలు!

సారస్వత సభలకు, సన్మానాలకు ఆహ్వానించినా పదవిలో ఉండగా వెళ్ళని ఆచార్యుల వారు శిష్య పండితుల నిర్బంధానికి తన నియమాన్ని కొంత సడలించుకోవడం జరిగింది.

గూడూరు 'సారస్వత పరిషత్తు' వార్షికోత్సవ సభకు ఒకమారు వెళ్ళవలసి వచ్చి ఆచార్యుల వారు బయలు దేరారు. రైల్లో ప్రయాణం. తన బోగీ దాదాపు ఖాళీగానే ఉంది. తన ఎదురు సీట్లో ఒక మధ్యవయస్కుడు తనతో సంభాషణ మొదలు పెట్టాడు. ఆయన పేరు శ్రీ రామచంద్రమూర్తి. ప్రధాని మంచి ప్రజా పరిషత్ ఛెయిర్మన్ వరకు తన పలుకుబడినీ, ప్రతిష్ఠనూ చెప్పుకు పోతున్నాడు.

"అజ్ఞాతంగా ఎందరో కవులూ, కళాకారులున్నారు. వారిని గుర్తించి సన్మానిస్తే కళామ తల్లిని సేవించినట్లవుతుంది. నా జీవితాశయం అదే."

మాటలు వింటున్నారు ఆచార్యులవారు. తన చేతిలో ఉన్న 'కవితా ఖండికలు' యథాలాపంగా శ్రీ రామచంద్రమూర్తి అందుకున్నాడు. ఆచార్యుల వారి పేరు తానిది వరకే విన్నట్లుంది.

"మేస్టారూ! మా 'కళా సమితి' సభలకు అతిథిగా తమరు రావాలి. మీ సాహిత్య ప్రసంగంతో మమ్మల్ని ధన్యుల్ని చేయాలి" అంటూ ఆహ్వానించాడు మూర్తి.

"మూర్తి గారూ! ఉదారాశయం గల మీ లాంటి ఉచితజ్ఞులు ఏ కొందరో ఉంటారు. మీ అభిమానానికి కృతజ్ఞతలు. వీలును బట్టి చూద్దాం" అన్నారు ఆచార్యుల వారు.

"మేస్టారూ! తేనెటీగల్ని పూల దగ్గరకు ఎవరు రమ్మంటారు గనక! కవిత మధువు హృదయ పుష్పాల్లో నింపుకొన్న మీ బోటి వారిని మధుపాల వంటి మే మాశ్రయిస్తుంటాము. మా సమితి ఆహ్వానాన్ని కాదనకండి! తేదీ అదీ తెలుపుతాము దయచేయాలి" అన్నాడు మూర్తి.

గూడూరు స్టేషను సమీపిస్తూండగా తన సూటుకేసు సర్దుకొంటూ ఆచార్యుల వారు మూర్తి గారితో సెలవు తీసికొన్నారు.

* * * * * *

చిత్తూరు 'కళా పరిషత్తు' ధర్మశాలలో

వార్షికోత్సవం జరుపు కొంటూంది. ఆచార్యుల వారు ముఖ్య అతిథి; సభ్యులు మేళతాళాలతో 'పూర్ణ కుంభ స్వాగతం' చెప్పారు. సభ విద్యుద్దీపాలతో రంగు కాగితాల రెపరెపలతో, జిజ్ఞాసువులైన శ్రోతలతో కిట కిట లాడుతూంది.

వైదిక ప్రార్థనతో సభా కార్యక్రమం ఆరంభమైంది. జిల్లా మేజిస్ట్రేటు సభాధ్యక్షులు. శ్రీ రామచంద్రమూర్తి కార్యకర్తగా హడావుడిగా తిరుగుతూ ఆచార్యుల వారిని పుష్పమాలాలంకృతుల్ని చేసి సభకు ఘనంగా పరిచయం చేశాడు.

తమ ప్రసంగంలో, రామాయణ మహాకావ్య విశేషాలనూ, పాత్రల వ్యక్తిత్వాలనూ, నేటి సమాజ సంస్కరణకు ఆ గ్రంథం ఎలా ఉపకరిస్తుందో చాలా సేపు అనర్గళంగా ఆచార్యుల వారు వివరించారు. కరతాళ ధ్వనులతో శ్రోతల హర్షాతిశయం మిన్ను ముట్టింది. కాశ్మీర్ శాలువ కప్పి ముఖ్య అతిథిని గౌరవించి ఒక పర్స్ బహూకరించాడు మూర్తి. సభ ముగిసింది.

* * * * * *

మూర్తి వీడ్కోలు చెప్పుతూ ఉండగా రైలు కదిలింది. మబ్బు పట్టిన ఆకాశం సన్నగా తుంపర రాలుస్తోంది.


ఎవరో ఇద్దరు ప్రయాణీకులు తన ఎదురుగా సీట్లో కూర్చున్నారు. వారు ఆచార్యుల వారిని చూచి "అయ్యా! నమస్కారాలు. నిన్న రాత్రి మీ ఉపన్యాసం మా కందరికీ బాగా నచ్చింది. చాలా విషయాలు కొత్తవి. మా అదృష్టం. మళ్ళీ తమ దర్శనమైంది" అంటూ రెండు చేతులూ జోడించాడు.


బుర్ర మీసా లాయన "మీ లాంటి పండితోత్తములు తృప్తితో దీవిస్తే మా పిల్లలకు కొంతైనా సరస్వతీ కటాక్షం లభిస్తుంది". అంటూ లాల్చీ జేబు నుంచి యాభై నోటు తీసి ఆచార్యుల వారి చేతుల్లో ఉంచి పాదాభివందనం చేశాడు.

"బాబూ! ఇదంతా ఏమిటి? ఎందు కిది?" అంటూండగా-"స్వామీ! మా భక్తి కిది గుర్తు. మా తృప్తి కోసం తమరు స్వీకరించాలి" అని అన్నాడు.

ఇంకొ కాయన "మేస్టారూ! మా రామచంద్రమూర్తి గారు చాల కష్టపడ్డా రండీ! మీ అమ్మాయి పెళ్ళికి, మా సమితి శక్తి కొద్దీ పోగు చేసిన విరాళంతో మీకు ఏ చిన్న అవసరం తీరినా చాలు. ఈ రోజుల్లో 'వెయ్యీ నూట పదార్లు' ఏమంత పెద్ద మొత్తం గనక!" అన్నాడు.

ఆచార్యుల వారికి ముఖం వివర్ణమైంది. మనస్సు క్షణ కాలం స్తంభించింది. ఏమనాలో తోచడం లేదు. చిరునవ్వు నింపుకోవడం కోసం ప్రయత్నిస్తూ, కేవలం నూట పదార్లు కూడా దక్కకపోతే ఏమయ్యేది? శ్రీ రామచంద్రుడు ఇంతే తనకు దక్కించా డనుకొంటూ శ్రీరాముని వ్యక్తిత్వాన్ని మహాకావ్యంలో వెతుక్కుంటూ మళ్ళీ సాహిత్య రసా స్వాదనకు పూనుకొన్నారు ఆచార్యుల వారు. ◆




# సలహా

పి.భావనారాయణ

నాకు మా రామం భార్య పద్మ అంటే చాలా సానుభూతి. ఎందుకంటే ఆమె ఎప్పుడూ నోరు విప్పి గట్టిగా మాట్లాడి ఎరగదు. వాళ్ళ పక్కింట్లో ఉన్న నాకు ఆవిడ మామూలుగా ఇంట్లో మాట్లాడే మాటలు కూడా వినబడ వంటే నమ్మండి.

నాకు ఆవిడ మీద సానుభూతికి కారణం వాళ్ళ అత్తగారు. ఆవిడ నోరు మహా పెద్దది. పొద్దున్న నాలు గంటలకు మొదలై ఆవిడ గొంతు రాత్రి 'ఇడియట్ బాక్స్' బందయే దాకా డిస్టర్బ్ చేస్తూంటుంది. ఆవిడ పద్మ మీద పెత్తనం, కేకలు వింటూంటే నాకే బాధగా ఉంటే పాపం పద్మ కెలా గుంటుందో? పరాయి పిల్ల అన్న అభిమాన మైనా లేదు ఆవిడ అత్తగారికి.

నా కో నమ్మకం ఉంది. ఎటువంటి వాళ్ళకైనా చెప్పవలసిన విధంగా చెప్తే వాళ్ళు దృక్పథాన్ని అర్థం చేసుకుంటారని. బహుశ రామానికి అలా తెలీక పోవడం వల్లే తల్లీ కొడుకుల మధ్య తరచూ వాగ్వాదం జరుగుతుండేది.

ఆ రోజు చాలా ఘోరంగా జరిగింది దెబ్బలాట. తల్లి ఏడుపు, రామం కేకలు, రామం ఏడుపు, తల్లి కేకలు.

అబ్బ రోజంతా గొడవే! ఇంట్లో ఉండ లేక పోయాను.

సాయంకాలం రామం నా దగ్గరకొచ్చి ఒక్కటే సొద. నా మాటంటే రామం అమ్మగారికి ఎంతో నమ్మకంట- వాళ్ళ అమ్మకి కొంచెం నచ్చజెప్పి అరువులు తగ్గించేటట్లు చేయమని. విధిలేక 'సరే' అన్నా.

మర్నాడు పొద్దున్న వాళ్ళింటి కెళ్ళేసరికి వాళ్ళ అమ్మగారు ఇంట్లో ఉన్నట్లు లేరు. ఇళ్ళంతా నిశ్శబ్దంగా ఉంది. రామం కూడా లేడు. పద్మ కూర్చోమని కాఫీ ఇచ్చింది. 'అత్తగారు పక్కింటి కెళ్ళారట. ఇప్పుడే వస్తా' రంది.

ఇంతలో వాళ్ళ పాప లక్ష్మి అక్కడికి వచ్చింది. వచ్చి తల్లి పక్క కూర్చుంది.

లక్ష్మి చాలా తెలివైన పిల్ల. ఆమెకు మంచి గ్రహింపు శక్తి ఉంది. ఆ పిల్లంటే నా కెంతో ఇష్టం.

లక్ష్మిని దగ్గరకు పిలిచే కూర్చో బెట్టుకుని అడిగా-"లక్ష్మీ! నువ్వు పెద్దయ్యాక డాక్టరవుతావా? ఏక్టరవు తావా?" అని.

లక్ష్మి తల అడ్డంగా ఊపింది.

"మరయితే ఏంటవు తావు?" అన్నా కుతూహలంగా.

"అమ్మ" అంది లక్ష్మి ముద్దుగా.

నేనూ, పద్మా ఫక్కున నవ్వేం. తల్లి మీద ఆమె కున్న ప్రేమకి, అభిమానానికి ఎంతో సంతోషించా. అయినా కొంటెగా "ఏం పాపా డాక్టరు కన్న అమ్మ అవడం గొప్పా?" అని అడిగా ఏ మంటుందో అని-

లక్ష్మి ముద్దు ముద్దుగా అంది.

"అవును. అమ్మయితే హాయిగా ఇంట్లో ఉండొచ్చు. పాలతో కాఫీ చేసుకుంటూ ఎప్పుడు కావాలంటే అప్పుడు తాగొచ్చు. ఇంట్లో ఎప్పుడూ అందరి. మీద పెత్తనం చెయ్యొచ్చు. గదిలో పడుకొని, తలుపులు వేసుకొని పుస్తకాలు చదువుకోవచ్చు. రోజూ మీగడ తినొచ్చు" అంది.

ఇంట్లో ఎప్పుడూ పను లుంటాయిగా. అలా ఎలా వీలవుతుంది?" అన్నా అమాయకంగా.

పాప పక్కున నవ్వింది నా అజ్ఞానానికి.

"అమ్మ లెక్కడయినా పని చేస్తారేంటి?" అంది.

పద్మా నేనూ తెల్లబోయాం.

"రామం వస్తే ఒకసారి పంపమ్మా" అని అంటూ గబగబా బయటకు నడిచాను. ✱